# చిరంజీవి-చీకటి ★

రచన :
శ్రీ పి. జయంత్ కుమార్.

(గతసంచిక తరువాయి)

పరాంకుశానికి ప్రత్యర్థిగా ఆ ఊళ్ళో మరో మహానుభావుడు అవతరించలేదు. అవతరించలేదని తెలిసి - దామోదరాన్ని ఇండిపెండెంటుగా అతని వైపున అడ్డు కట్టవేశారు ఊళ్ళో తెలిసిన బాగా పేరున్న వెనుకబడిన జాతి పెద్దలు. దామోదరాన్ని విజయం వరించింది కాని డబ్బు హరించుకు పోయింది.

ఇద్దరి కేసూ చాలా పకడ్బందీగా నడుస్తుందని మధ్యలో మళ్ళీ కొన్ని వార్తలందాయి.

ఈ మధ్యలో నాకు "స్పాట్ వాల్యుయేషన్" రావడం, పేపర్లు దిద్దడానికి హైదరాబాద్ వెళ్ళిపోయాను.

"వర్షఋతువు రావడానికి ఇంకా కొద్దిరోజులే ఉంది అప్పుడే చిలిపిరి వానలు మొదలయ్యాయి. కోయిలకూతలు మనోహరంగా వినిపిస్తున్న లేతని పచ్చిక బయళ్ళు అందంగా కనిపించాయి. హైదరాబాద్ నుండి తిరిగి రావడమే తరువాయి స్కూళ్ళు తెరిచారు. విశ్రాంతి లేకం నాకు కాలేజిలో జాయిన్ కావడం జరిగిపోయింది. మా ఊళ్ళో కొత్తగా జూనియర్ కాలేజి తెరిచి ఎన్నో రోజులు కాలేదు, ఎలాగూ మా ఊళ్ళో కాలేజి తెరుస్తున్నారు కదా...! అని అనుకొని మా ఊరికి ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాను. నేను చెబుతున్నది పాలిటిక్స్... కాని ఊరి రాజకీయాలకు, బడి రాజకీయాలకు పొత్తు ఉంటుందేమోనన్న అనుమానం నాకు కాకపోలేదు... కాలేజి వాతావరణమంతా రాజకీయాలతో కలుషితమయి పోయిందన్న వార్తలు నా చెవిల్లో చిన్ననాటినుండి (నా హైస్కూలు చదువు మా ఊళ్ళోనే పూర్తిచేశాను) గింగురుమంటునే ఉంటాయి. అసలు పట్టించుకునే ప్రతాపంకానీ శ్రద్ధకాని ఎవరికుంది? ఒకవేళ అలాంటిదేమయినా జరిగితే అవి మత కల్లోలాలకు దారితీస్తాయని ఓ రాజకీయ వేత్త వ్యాఖ్య.

కాలేజిలో నా పాఠాలు వేగాన్నందుకున్నాయి. ఈ వేడిలో దామోదరం—పరాంకుశాలు ఏమయ్యారో పట్టించుకోలేదు.

అయితే ఓ రోజు నా దృష్టి పేపరు మీదుండగా 'పంచాయితీ ఎలక్షన్లు' అన్న శీర్షికపైకి నా కళ్ళు దాడి చేశాయి.

"అయితే మా ఊరు మళ్ళీ 'రణరంగంగా' మారడానికి అవకాశాలు హెచ్చు అవుతున్నాయన్నమాట" నా అంతరంగంలోని ఓ మూల ఎవరికీ డిస్టర్బ్ కాకుండా మూలిగేసింది...

"మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు"గా నన్ను ఆంధ్రదేశంలోని మరో మారు మూలకు బదిలీ చేస్తున్నట్టుగా ఆర్డర్సు చేతికందాయి.

ఇది అన్యాయం, మహాఘోరం, మూడేళ్లు కాకముందే నన్ను బదిలీ చేయడం అన్యాయం, అన్ని విధాల మా జాయింటు డైరక్టరు గారితో మొరపెట్టుకున్నాను. మాజీ డైరక్టరుగారు ప్రేమపాత్రుడు, నా మొర ఆలకించి నన్ను బదిలీ చేస్తున్నట్టుగా ఇచ్చిన ఉత్తర్వులను నిలుపుదల చేశారు, అందుకు సంతోషించడం మా ఇంటి మనుషుల విషయమయితే నేను పడ్డ కష్టాలకు విచారించడం నా స్వవిషయమయింది.

♦ ♦ ♦

ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో ఊరు కొన్ని సహజ మార్పులకు ఆలవాలమయింది. ఊరు ఊసరవెల్లిలా రంగులు మార్చడం నేర్చుకున్నదని నాకు ఓటు వేసే హక్కు ఏర్పడిననుంచీ తెలిసిపోయింది.

గ్రామపంచాయితీ చైర్మన్‌గా ఎవరు ఎన్నిక కావాలన్నది ఓ వితండవాదమయి కూర్చుంది. ఎన్నికలు ప్రత్యక్షరూపంలో వున్నా ఆ ఎన్నిక కాబోయే దెవరో అని ప్రజల్లో ఊహాగానాలు మొదలయ్యాయి. కొత్త సబ్జక్టు కోసం కథా రచయిత ప్రాకులాడిపోతున్నట్టుగా మరో కొత్త చైర్మన్ను ఎన్నుకోవాలని వొకవైపు, ఒక పార్టీ ఊరేగిపోతే...

పోయిన ఎనిమిదేళ్ళనుంచీ-ఉంటున్న మనిషే! మళ్ళీ చైర్మన్ అన్నది మరో పార్టీ కోరికయి కూర్చుంది.

దామోదరాన్ని, పరాంకుశాన్ని కదిపి లెక్కిస్తూ

సన్మానాలు జరిపేస్తుంటే, ఏ పార్టీ వాడికి 'వోటు' వేయాలి అన్న ధ్యాసలో ఉబ్బితబ్బిబ్బయి పోతున్నారు జనం.

ఓ రోజు సెలవుదినం చూసుకొని, దామోదర మింటికి వెళ్ళాను.

నన్ను చూడగానే, 'రావోయ్ రా! నిన్ను చూసి చాలా కాలమయింది. అసలిటు రావడమే మానేశావ్!' అని పులకరింత కలిగేట్టుగా పలకరించేశాడు దామోదరం. నేనేమీ కదిలించకముందే తానే చెప్పుకొచ్చాడు.

'మా మన్మథరావు స్టేట్స్ వెళ్ళాడోయ్! ఏదో రిసెర్చి ప్రయోగాలంటూ అక్కడే జీవితం గడిపేస్తానని అనుకుంటున్నాడు.' అని దామోదరం చెబుతుంటే... నో చెవి అటుపారేశాను. తనుకూడా ఏమీ మందలించక పోతే ఏమి బాగుండదన్న సీక్వెన్స్ని బట్టి...

'మళ్ళీ మన్మథరావు స్టేట్స్నుంచి ఎప్పుడు తిరిగొస్తున్నాడండీ' అని ఎంతో వినయం ఉట్టిపడేలాగా అడిగేశాను. రాజకీయ మహానుభావుల ముందు ఆ మాత్రం పోంగు చూపించకపోతే అనర్థాలు అనేకం అని నమ్మిన వాణ్ని నేను. అందుకే మరీమరీ నేను కూర్చున్న కుర్చీకి అంటీ అంటనట్టుగా లేచి అడిగేశాను.

'అదేమిటయ్యా వరాల్ రావ్! నేను వాణ్ని ఫారిన్ కు పంపించింది తిరిగి రావడానికా! అహ...హ...(వికారమైన నవ్వు) కొడుకు కోడలు అక్కడే సుఖంగా సెటిల్ అయ్యి, ఎన్నో చదువులు చదివి, ఇంకా ప్రయోగాలు చేసి మన దేశానికి ఎంతో పేరుతెచ్చి, గొప్పవారయి పోవడానికి పంపించాం కాని, సరిగ్గా పిడికెడు అన్నమయినా దొరకని మనదేశానికి మళ్ళీ తిరిగి రావడమా?' అని మళ్ళీ మరో భీకరమయిన నవ్వును నావైపుకు రువ్వేశాడు. ఇక నాకు అక్కడ ఏంచేయాలో అంతుబట్టలేదు. మెల్లిగా లేచి, 'ఇక నాకు సెలవిప్పించండి! దామోదరం గారూ వెళ్ళొస్తాను' అని గుమ్మంవైపుకు కదలబోయాను.


'అలా కూర్చోరయ్యా నాయనా! అసలు విషయం అడగవేంటి?' గారపట్టిన పళ్ళతో ఇకిలించాడు.

'ఏ విషయం?' బుడిబుడి దీర్ఘాలు తీసినట్టుగానే అన్నాను.

'నీకు తెలియదేంటి వరాలూ! అదే మా చిన్నోడు, చిన్నకూతురు విషయం' కళ్ళు బాగా కనుబొమ్మలతో సహా పైకి పెకిలించి, నా మొహంలో దాదాపుగా మొహం పెట్టి అడిగేశాడు.

'ఆ విషయంలో నాకేం తెలుసని! దామోదరానికి చెబుతాను. కొన్ని సెకండ్లు అలాగే ఆగిపోయాను.


LPC (R)



ఎల్. పి. సి. మోనోబ్లాకు రెండు స్టేజి డీప్ వెల్

- జెట్ పంపులు -

రెండుస్టేజి పంపులు ఎక్కువగా అతిప్రెషర్‌లో సాధారణ జెట్ పంపుకన్నా నీళ్ళ నందించును.

ఎంత లోతైన బావినుంచి అయినా సరే మా మోనోబ్లాకు జెట్ పంపు సెట్టులు అతిసులువుగా మీకు నీళ్ళు అందించును.

½ H.P. నుంచి 5 H.P. వరకు దొరకును.

: వివరములకు :

Grams: "NAIDUBROS" Phone: Office: 24997 Works: 22757

THE EL-P-EM INDUSTRIALS

393, Mettupalayam Road (P.B. No. 1053) COIMBATORE-641002



★

"ప్రియ"

చిత్రంలో

రాధిక

★

ఒక్కసారి గుండె వాల్ క్లాక్ లా టిక్కు టిక్కుమని కొట్టుకోడం మొదలెట్టింది. ఆ చిన్నాడికి, చిన్నదానికి ట్యూషన్ చెప్పమని నా వొత్తిడి కాదుగదా ఈ అడగడం. అసలే పిరికి గుండె అందులోనూ, దామోదరం లాంటి మహాకాయం ముందు బేల అయిన నా శరీరం 'లారెల్ అండ్ హార్డీ' లాగా అనిపిస్తుంది.

'ఏం చెప్పకుండా అలా నల్లిలా నక్కిపోయావేం వరాలూ?'

అతని చేతులు నా భుజాలను మరోసారి స్పర్శిస్తున్నాయి. దామోదరం దగ్గర నాకు చనువు బాగా వుందన్న విషయం అతని సంభాషణనిబట్టి తెలిసిపోయింది.

'నేనేం... నేనేం ... చెప్పాలి' తడబడుతూ అన్నాను.

'అదేగదయ్యా నువ్వు చెప్పాల్సింది...ఎవరయ్యా నీకా వంతులు వనిప్పించింది! ధైర్యంగా వుండాల్సిన నువ్వు అలా పిల్లికూనలా భయపడిపోతే ఇక నువ్వేం చదువూదేస్తావ్?' హా...హా...హా...మళ్ళీ నవ్వు.

నేనేటూ అర్థంగాని చవటలా ముఖాన్ని మూడొంకర్లు తిప్పుతున్నాను. ఇంతలోనే దామోదరం తానేదో చెప్పబోతున్నట్టుగా వుపక్రమించాడు.

'చూడు వరాలూ! ఇక నాకు మిగిలిందల్లా మా చిన్నబ్బాయి, ఆ చిన్నకూతురు, వాళ్ళిద్దరి భవిష్యత్తును ఆలోచించి పారేశాను. అదేమిటంటే ఈ కాలంలో కులాలకు, మతాలకు పట్టింపు మాయమయింది గదా, దేశమంతా ఒకటిగా అయిపోయి సుస్థిరత్వంతో, సుఖంలో తేలిపోవాలి గదా అందుకే మన నాయకులు బోధిస్తున్న దాన్ని మనం అక్షరాలా పాటించాలి. అంటే కులాలకు, మతాలకు దూరంగా వుండడమే కాదు మనం చెయ్యాల్సిందీ, చేసి చూపించాల్సిందీ. మన పిల్లల విషయంలో కూడా మార్పు తేవాలి. అందుకే నేనో నిర్ణయానికొచ్చేశాను' అని వోసారి ఊపిరిపీల్చి మళ్ళీ మొదలెట్టాడు దామోదరం.

'అందుకే మా చిన్నకు, చిట్టికి రేపు అంటే భవిష్యత్తులో కానీ, కట్నంలేకుండా కులమతాలను పాటించకుండా అన్య కులాల వాళ్ళకిచ్చి, పెళ్ళిళ్ళు చేసేస్తాను. హా...హా...హా...ఎలా వుంది వరాలూ నా ఆలోచన?' మహాపొంగిపోతూ తానన్న మాటకు తానే ఊగిపోతున్నాడు. అయితే ఈ ఇద్దరి చిన్నపిల్లల భవిష్యత్తు అప్పుడే దామోదరం తనకుతానుగా నిర్ణయించేశాడన్న మాట! అతని మాటల్లో ఎంత అభ్యుదయం! అబ్బురంగా మనస్సులోనే నా భావాలను మీటాను. మరో చిన్న అనుమానం నా హృదయానికి నాటింది...

'అయితే ఇవన్నీ దామోదరం నాకు చెప్పడమేమిటి? తానసలు యిక్కడికొచ్చింది దామోదరం కొడుకు

ఎల్లప్పుడూ......
టి. ఎన్. హెచ్. వారి
* సైనిక్స * ఆర్. ఓ.
కలర్ బనిన్లనే
ఉపయోగించండి.

ఆంధ్రా మరియు ఒరిస్సా ఏజెంట్లు:—
దుర్గా ఏజెన్సీస్, పి. బి. నెం. 84, విశాఖపట్నం-4.

మన్మథరావు గురించి మంచిచెడ్డలు వాకబు చేయడానికి. కాని ఇతను వివరిస్తున్నదంతా ఆగిపోయింది అక్కడికి నా అనుమానం.

'ఐతే వరాలూ! ఇవన్నీ నీ కెందుకు చెబుతున్నా నంటే నీవు చదువుకున్నోడివి, అందులోనూ మనూరి పెద్ద పిల్లలకు పాఠాలు చెపుతున్నోడివి. అలాగే నా యీ విషయాన్నికూడా ఆ పిల్లల చెవిలో వేసేస్తే వాళ్ళకు కులాలకు, మతాలకు ఎంతెంత దూరం వుండాలో తెలిసొస్తుంది ఏమంటావు పంతులూ!'

మెల్లిమెల్లిగా కిటుకు బయటపెట్టాడు దామోదరం.

ఇంతలో మేము కూర్చున్న గది ముందర వరండాలో ఎవరో వచ్చినట్టు సంకేతంగా కాళ్ళ చప్పుడు వినిపించింది...

'అసలే వరాలూ ఇక నీవెళ్ళిరా! నే చెప్పింది మాత్రం మరిచిపోకేం! సాధ్యమయినంత జనానికి నా విషయం చెప్పేయ్' అని తన సోఫాలోంచి లేచాడు.

ఇక నేను సభ్యతగా మాట్లాడ్డం నా భావాలను వెలిబుచ్చడం- అసభ్యకరంగా మారిపోతుందేమోనని భయమేసి, గుమ్మంలో వుంచిన చెప్పులు తొడుక్కొని బయటకు దారితీశాను.

వరండాలో ఉత్సవ విగ్రహంలా నిలబడ్డ పరాంకుశం ఎదురయ్యాడు. కొంత ఆశ్చర్యపోయాను. దామోదరం విరోధి! ఇక్కడ దామోదరం ఇంట్లోనా...ఇంతలో...

'రా బావా రా! నీ కోసమే చూస్తున్నాను' అన్న మాటలు దామోదరం పెదవుల కదలికలోంచి వెలువడడం చూసి, బయట కడుగేశాను.

• • •

పంచాయితీ ఎలక్షన్లు మరో పది రోజులున్నాయనగా తెలిసింది. దామోదరం పార్టీ ఫిరాయించి, అధికార పార్టీలో చేరిపోయాడని అనధికారంగా వెలువడ్డ ఆ వార్త...అధికారంగా మరో రోజు పేపర్లో ప్రత్యక్షమయింది...మరి పరాంకుశానికి, దామోదరానికి మధ్యలో పెరిగిన కోర్టుకేసు రద్దయిపోయి రద్దీలో కలిసిపోయింది.

• • •

ఓ రోజు మా వూరి ముఖ్యమైన రహదార్ల కూడలిలో అందరినీ చమత్కరిస్తూ దామోదరం ఉపన్యసిస్తున్నాడు. అందులో భవిష్యత్తులో తాను తన పిల్లల పెళ్ళిళ్ళు... అన్యకులాల వారితో కానీ కట్నం లేకుండా కులమతాలను పాటించకుండా ఎంతో వున్నత హృదయంతో జరిపిస్తానని చెబుతున్నాడు. ప్రజలకిస్తున్న వాగ్దానాలలో ఇలాంటి కొత్త మలుపులను చేర్చి వూదేస్తున్నాడు. అది విని అక్కడి ప్రజలు కరతాళధ్వనులు చేస్తూవుంటే ఆ సాయంత్రం పశ్చిమాన క్రుంగిపోతున్న సూర్యుడు మరింత లోనికి జరిగి పూర్తిగా క్రుంగిపోయాడు. రాజ్యంలో చీకటి మరింత చిక్కబడింది.

—: సంపూర్ణం :—

★

మన్నికకు, అహ్లాదానికి...
పంజు టెక్స వారి
* మాస్టర్ * ఫాంటెక్స
ఫైన్ బనియన్లనే వాడండి.

ఆంధ్రా మరియు, ఒరిస్సా ఏజెంట్లు:—
దుర్గా ఏజెన్సీస్ పి. బి. నెం. 84, విశాఖపట్నం-4.